

# నాన్న తప్పిపోయాడు

శాంత దిగాలుగా కూచుంది...

చేటలో వున్న బియ్యంలో రాళ్లేరబోతూ భర్త గుర్తొచ్చి దీర్ఘాలోచనలో పడి పోయింది. ఎన్నేళ్లయింది ఆయన్ని చూసి...

సరిగ్గా ఏడేళ్ల ...

ఆ ఆవేశం...

అన్యాయాన్ని సహించని ఆ చూపులు ...

కొరడాతో కొట్టినట్టుండే ఆ మాటలు ...

అన్నీ ... అన్నీ కలిసి... అడవి దారి పట్టించి అప్పుడే ఏడేళ్ళు గడిచాయి. ఎప్పుడో... ఎక్కడో... ఎవరో తుపాకి తూటాలకి నేలకొరిగారని తెలిసినప్పుడల్లా చిగురుటాకులా వణికిపోతూనే వుంది. అప్రయత్నంగా తాళిబొట్టుని కళ్లకద్దుకుంటూనే వుంది.

ఎక్కడున్నాడో... ఎలా వున్నాడో... ఏమయ్యాడో...

ఏడేళ్లలో ఒక్క ఉత్తరం లేదు... ఒక్క సందేశం లేదు... అసలు భార్యా ఇద్దరు పిల్లలు ఏమయ్యారోనన్న ధ్యాసే లేదు. రవిగాడు రెండు నెలల పసికందుగా వున్నప్పుడు... తాను పచ్చి బాలింతగా వున్నప్పుడు... ఎవరికీ చెప్పకుండా... ఏ అర్ధరాత్రో లేచి వెళ్లి పోయాడు.

రవిగాడికి అప్పుడే ఏడేళ్లొచ్చాయి రెండో తరగతి పట్టాడు. పెద్దోడు శీనుగాడికి పదకొండేళ్లొచ్చాయి. వాడు ఏడో తరగతికొచ్చాడు.

ఈ మధ్య ఆయన మీద పోస్టర్లేసారంటే... ఎంత ఆతృతగా పరుగు పరుగున బస్టాండ్ గోడదగ్గరికెళ్లి చదివింది.

ఆయన ఫోటో చూసి... కన్నీళ్ల పర్యంతమైంది.

కాని... ఆయన్ని పట్టిస్తే... పది లక్షల రివార్డ్ అని చదివి కంపించిపోయింది. కొత్తగా మరో భయం పట్టుకుంది. ఆయన ఇంటికి రాకపోయినా పర్లేదు. కాని డబ్బు కోసం ఎవరైన ఆయన్ని పట్టిస్తే...??

అందుకే ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా తన గుండె బిక్కచచ్చిపోతుంది.

ఆలోచనల్లో మునిగిపోయిన శాంతని దాటేస్తూ రవి స్కూల్‌నించి వస్తూనే ...రుగా ఇంట్లోకెళ్లి బ్యాగ్ పడేసి జేబులో దాచుకున్న బొమ్మ పిస్తోల్‌ని తీసి తల్లివైపు విసిరేసాడు. ఆలోచనల్లోంచి బయటికొచ్చి

శాంత ఆశ్చర్యపోయింది.

"ఏమైందిరా.... పిస్తోలు బొమ్మ కావాలని నాల్రోజులు ఏడ్చి పట్టువట్టి మరీ కొనిపిచ్చినవ్ ఇప్పుడేమో ఏడుస్తున్నావ్ ఏమైందిరా దీనికి?" అంది కోపంగా.

"నీయవ్వ... స్కూల్లో ఈ బొమ్మ చూసి టీచర్లంత నవ్విండ్రు. అడవిలోంచి మీ అయ్య పంపినాడ్ర... అని బాగా నవ్వుకున్నరు" అన్నాడు వాడు విచారంగా ముఖం పెట్టి.

శాంత మనసు చిన్నబోయింది.

తన పిల్లల పట్ల జనం చూపించే జాలికి ప్రతిసారీ దుఃఖం పొంగుకొస్తుంది. ఇప్పుడిప్పుడే బుద్ధికొస్తున్న శీనుగాడిని జనం అడిగే ప్రశ్నలకి వాడి దగ్గర జవాబుల్లేక... తననీ అడగలేక ఇంటికొచ్చి హోంవర్క్ ముందేసుకొని ఏమీ రాయకుండా అలాగే కూచుండి పోతుంటాడు.

తండ్రి ఫోటోముందు కూచొని నిశ్శబ్దంగా దుఃఖిస్తాడు.

తన కళ్లల్లో నీళ్ళు కనబడితే... నేనున్నాను కదమ్మా అంటూ చెక్కిళ్లు తుడుస్తాడు. ఆయన మీద కోపం వచ్చి ఏ తాగుబోతుని కట్టుకున్న ఇంత అరణ్యరోదన వుండేది కాదేమో అన్పిస్తుంది. ఆయన ఇంటికొస్తే... కట్టుకున్నదానికి కనీస భద్రత ఇవ్వకుండా సమాజం గురించి కలలుగనే మీలాంటి వాళ్ల కామ్రేడ్లకు చచ్చేదాకా మందులుండవేమో అని నిలదీసి అడగాలన్పిస్తుంది.

పేరంటాలకి పిలిస్తే ఎక్కడ తమ మీద ఇన్‌ఫార్మర్లు అనే ముద్ర పడుతుందనే భయంతో బంధువులంతా ఏ పండక్కీ పిలవక పోయినా... ఓదార్చేది పెద్దోడే.

చిన్నోడికి మాత్రం కనిపించని నాన్నంటే కోపం... ఏ స్కూల్ పిల్లాడైనా తండ్రితో కన్పిస్తే.... వీడిలో కసి కన్పిస్తుంది.

"అమ్మా... నాన్న ఇంటికొస్తే ఇన్నాళ్ళు మమ్మల్ని విడిచి ఎక్కడికెళ్లావని డిష్యుం డిష్యుం అని ఈ పిస్తోల్‌తో చంపేస్తా" అంటాడు ఆబొమ్మ పట్టుకొని చిల్వాకోడూర్ జాతరలో ఏడ్చి సాధించి కొనుక్కున్నాడు. వాన్ని ఎలా సముదాయించాలో శాంతకి అర్థం కాలేదు. బియ్యం చేట పక్కన బెట్టి వెళ్లి వాన్ని ఎత్తుకుంది.

వాడు తల్లి కళ్లల్లోకి సీరియస్‌గా చూస్తూ 'నాన్నెప్పుడొస్తాడు' అన్నాడు.

"వస్తాడ్రా" అంది ముభావంగా

"రాగానే మా టీచర్లని తన్నమని చెప్పాలి"

"అలా అనొద్దు బిడ్డా... నువ్వు బాగా చదువుకోవాలి" అని వాడి తలని

భుజంమీద ఆనించుకుంది.

అప్పుడే స్కూల్ నించి శ్రీను సైకిల్‌మీదొచ్చాడు. సైకిల్ లోపల పెట్టేసి తమ్ముడికేమైందమ్మా" అన్నాడు. అంత చిన్న వయసులోనే వాడి ముఖంలో మాటలో ఏదో గాంభీర్యం కన్పిస్తుంది.

"ఏం కాలేదు కాని... నువ్వు (ట్యూషన్) టివీషన్ కెళ్తావా బిడ్డా" అంది శాంత.

"వెళ్లనమ్మా..." అంటూ దిగాలుగా ఇనుపకుర్చీలో కూలబడ్డాడు.

"నీకేమైంది బిడ్డా..." అంది అనునయంగా

వాడిలో మౌనం...

"ఏమైందిరా శీనూ..." అంది చిన్నోడు చంకదిగి మళ్లీ బొమ్మ పిస్తోల్ అందుకున్నాడు

"ఏం కాలేదమ్మా... పది లక్షలిస్తమని బాపు మీదేసిన పోస్టర్ల గురించి ఇవ్వాల క్లాస్‌లో నా సోపతోల్లందరూ అడిగింద్రు" అని చెప్పాడు.

శాంత కూడా మూగవోయింది.

తండ్రి గురించి ఎవరడిగినా... ఆ పసిపిల్లల దగ్గర ఏం జవాబులున్నాయి?

"అన్నీ పట్టించుకోవద్దు బిడ్డా... నీ చదువు పాడైతది" అంది దగ్గర కూచుంటూ

"అది కాదే..." అన్నాడు ఏదో బాధగా.

వాడి కళ్లల్లో కన్నీటి పొరలు చూసి శాంత కదిలిపోయింది. వాడెంత కుమిలి పోతున్నాడో. అర్థమై దుఃఖం సుడిగుండమై ఎగిసొచ్చింది. కాసేపట్లో తల్లి ఏడ్వబోతుందని గ్రహించిన శ్రీను తమాయించుకున్నాడు.

"నేను ట్యూషన్ కెళ్తా... నాకు ఛాయ్ పెట్టిపొయ్యి" అంటూ లేచాడు. శాంత కూడా తమాయించుకుంది. శ్రీను కాళ్ళు చేతులు, మొహం కడుక్కొచ్చుకున్నాడు.

వాడికింకా నాన్న గుర్తున్నాడు.

తనంటే నాన్నకెంత ప్రేమో...నాలుగేళ్ల వయసులో ఓసారి జాతర్లో తప్పిపోయి మూడు గంటల తర్వాత దొరికాక ఎన్ని ముద్దులు కురిపించాడో... ఇంకా గుర్తుంది ఆ సంఘటన. బుగ్గలు, బోలుపేలాల ముద్దలు కొనిచ్చి ఇంటిదాకా భుజం మీద ఎత్తుకొచ్చాడు. అంతటి ప్రేమగల తండ్రి తమని మర్చిపోవటం... వాడి పసి మనసుకు ఇంకా మింగుడు పడని విషయం.

అంతలో శాంత ఛాయ గ్లాసు తెచ్చిచ్చింది.

ఛాయ్ తాగి పుస్తకాల సంచీ భుజానేసుకొని ... సైకిల్ మీద వెళ్లిపోయాడు. వాడి పెద్ద మనసుకి శాంత మనసు కన్నీళ్లతో పొంగిపోయింది.

***          ****          ****

మర్నాడు

పిల్లలిద్దరూ స్కూల్కెళ్లిపోయాక... మధ్యాహ్నం... ఎన్నడూ లేనిది పోస్ట్మ్యాన్ లెటర్ తెచ్చివ్వటం శాంతకి ఆశ్చర్యం కలిగించింది.

ఆ ఉత్తరం తన పేరు మీదే రావటం మరింత విస్మయం కలిగించింది. తనూ మూడో తరగతి వరకూ చదువుకుందే కాబట్టి ధైర్యంగా కవర్ చించింది.

తెల్ల కాగితం మీద ఎర్రటి అక్షరాలు...

"శాంతకి క్షమాపణలతో....

బాగున్నావా శాంతా... శీను, రవి ఎల్లా వున్నారు? నా ఆరోగ్యం కొంత దెబ్బతిన్నది. మీరంతా గుర్తొస్తున్నారు. ఇందులోంచి బయటికి రావాలన్పిస్తోంది. ఈ నెల 27న కరీంనగర్‌లో పోలీసులు 'లొంగుబాటు మేళా' నిర్వహిస్తున్నారు. అందులో లొంగిపోవాలనుకుంటున్నాను. నా పేరు మీద ఇప్పుడు పది లక్షల రివార్డ్ ప్రకటించారు. నేను లొంగిపోతే ఆ డబ్బు కూడా నాకే ఇస్తారు. ఇన్నాళ్లు నిన్ను కష్టపెట్టుకున్నందుకు మరోసారి క్షమించు. 27వ తేదీన ఇంటికొస్తాను.

ఇట్లు

సదాశివ్ అలియాస్ క్రాంతివీర్

ఆ ఉత్తరం చదివి దుఃఖమో సంతోషమో తెలీకుండానే శాంత బావురుమని ఏడ్చింది. అయిదు నిమిషాల్లో కళ్లు తుడుచుకొని గబగబా తలుపులేసి అనసూయమ్మకీ, గంగత్తకీ, మల్లన్న బాపుకీ చెప్పొచ్చింది.

గుండెలో విపరీతమైన దడ...

కాలూ చేయ్యి ఆడనివ్వనంత ఆరాటం...

పిల్లలు స్కూల్‌నించి ఎప్పుడొస్తారన్న ఆతృత...

ఇరవై ఏడవ తారీఖు

ఇరవై ఏడవ తారీఖు

ఇరవై ఏడవ తారీఖు

కొన్నివేలసార్లు పలవరించింది. క్యాలెండర్‌ని చూసింది. ఇంకా ఆరురోజులు... ఇంకా ఆరు రోజులు....

ఆరు రోజులు....

బీడీల చేటని మూలకి విసిరేసింది. దేవుడి పటాలు కొంగుతో తుడిచింది. చీపురుతో బూజు దులిపింది.

మనసులో మనసు నిలవక... చిన్నోడు స్కూల్‌నించి రాగానే ఎత్తుకొని ఆనందంతో ముద్దాడింది వాన్ని గిరగిరా తిప్పింది.

"మీ నాన్న వస్తున్నాడ్రా..." అంది.

వాడు కోపంగా చూసాడు. బొమ్మ పిస్తోల్ తెచ్చి జేబులో పెట్టుకున్నాడు. శాంత నవ్వింది... నిండారుగా...

నింపాదిగా...

నిష్కల్మశంగా....

ఆ నవ్వు వాడిలో ఏదో ధైర్యాన్ని నింపింది. వెంటనే 'మా నాన్న వత్తున్నాడో...' అంటూ అరుస్తూ బయటికి పరిగెత్తాడు.

అప్పుడే శ్రీను సైకిల్ దిగి లోపలికొచ్చాడు.

ఇంట్లో ఏదో కొత్తవాతావరణం కన్పిస్తున్నట్టుగా అన్పించింది. బావి దగ్గర గిన్నెలు కడుగుతున్న శాంత 'శ్రీను... శ్రీనూ... అంటూ పరిగెత్తుకొచ్చింది.

తల్లి మొహంలో అంత ఆనందాన్ని వాడెప్పుడూ చూళ్లేదు. తడి చేతులు తుడుచుకోకుండానే కొంగుకి కట్టుకున్న ఉత్తరాన్ని తీసి "శ్రీనూ... ఇది చదువురా... మీ బాపొస్తుండు" అంది. శ్రీను ఆ ఉత్తరాన్ని చదివాడు.

అలాగే కుర్చీలో కూచుండిపోయాడు.

వాడిలో ఏ సంతోషమూ కన్పించలేదు... శాంత నివ్వెరపోయింది.

"అదేమిట్రా... మీ బాపు వస్తుండంటే... నువ్వట్లయినవ్" అంది.

వాడు ఎటో చూస్తూ "అమ్మా... నాన్న రావటం నాకిష్టంలేదు" అన్నాడు. ఆ మాటకి శాంత నోరు తెరిచింది.

"ఎందుకురా?" అంది కోపంగా

"నాన్న ప్రజలకి ద్రోహం చేస్తున్నాడు" ఏదో దీర్ఘాలోచనలోకెల్లిపోయి అన్నాడు.

"నీకేమన్నా పిచ్చా... ఏం మాట్లాడుతున్నావ్?" అని అరచింది.

"అవునమ్మా... ఏ అజ్ఞాత నాయకుడైనా ప్రభుత్వానికి దొరకట్లేదంటే ప్రజలు దాచిపెట్టడం వల్లనేనమ్మా... ఎన్నిసార్లు వాళ్లు దాచిపెట్టడం వల్ల నాన్న తలకి పది లక్షల రేటు పెరిగింది? మరిప్పుడు నాన్న లొంగిపోతే ఎవరికి లాభం...??

ఎవరికి ద్రోహం... ???"

వయసుకి మించిన కొడుకు మాటలకి నిర్ఘాంతపోయిన శాంత స్థాణువైంది.

"నాన్న ఉద్యమంలో చచ్చిపోయి వస్తే సంతోషపడతాను, కాని పదిలక్షలతో లొంగిపోయివస్తే... భరించలేను..."

ఈ మాట తల్లితో అన్లేదు... మనసులో అనుకున్నాడు.

ఉత్తరాన్ని 'తల్లి చేతిలో కుక్కి... పుస్తకాల బ్యాగ్ భుజాన వేసుకొని సైకిల్ తీసుకొని మౌనంగా వెళ్లిపోయాడు.

శాంత మళ్లీ కంపించిపోయింది.

అగరొత్తి పొగలా పరుచుకున్న ఆనందమేదో ఆవిరైపోతున్నట్టుగా తోచింది.

*** **** ****

ఇరవై అయిదవ తేది...

తెల తెల వారుతుండగా... ఆ దుర్వార్త శాంతని చేరింది.

'రామగిరి గుట్టల్లో రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్లో సదాశివ్ చచ్చిపోయాడు' పిల్లలింకా నిద్ర లేవలేదు...

భళ్లున పగిలిన శాంత దుఃఖంతో ఉలిక్కిపడి లేచారు.

ఇన్నాళ్లూ లేని ధైర్యంతో... ఒక్కొక్కరే ఆ ఇంటివైపు సానుభూతితో

వస్తున్నారు. పిల్లలిద్దరికి విషయం తెల్పి... తల్లితో పాటు బావురుమన్నారు. శాంత తలబాదుకుంటూ వాళ్లని దగ్గర తీసుకొని మరింత ఏడ్చింది.

కొంగున ముడేసుకున్న ఉత్తరాన్ని విప్పి చూసుకుంటూ... గుండె లవిసేలా ఏడ్చింది.

వచ్చిన వాళ్లంతా ఎవరి జ్ఞాపకాల్ని వారు నెమరేసుకున్నారు.

సూరీడుకి దడ పుట్టి పడమట దిక్కుకెళ్లిపోయాడు.

సాయంత్రం అవుతుండగా... శవం వచ్చింది.

త్వరగా అంత్యక్రియలు చేయడానికి పెద్దమనుషులు హడావిడి పడుతున్నారు.

శాంత శవం మీద పడి బోరుమంది.

పాడె కట్టారు.

దాన్ని భుజాలకెత్తుకునేముందు 'ఆఖరిసారిగా మీ అయ్యని సూసి... కాళ్లకు మొక్కుండ్రి అంటూ నలుగురు పెద్దమనుషులు శ్రీనుని, రవిని తీసుకొచ్చారు.

శ్రీను కన్నీళ్లతో తండ్రి మొహంలోకి చూసి చేతులెత్తి మొక్కాడు. తండ్రి శవం దగ్గరికి అడుగులో అడుగేసుకుంటూ బిక్కు బిక్కుమంటూ వచ్చిన రవి ఒక్కసారిగా పెద్దమనుషుల్ని విదిలించుకొని అరిచాడు...

"నేను నాన్నని చూడను... ఇప్పుడు చూస్తే ఆ ముఖం ఎప్పుడూ గుర్తొస్తది... నేను చూడను... నాన్న జాతర్లో తప్పిపోయిండనుకుంటా... నేను ముఖం చూడను..."

అంటూ ఏడుస్తూనే ఇంట్లోకి పరిగెత్తాడు.

వాడి చర్యకి అందరు చలించిపోయారు.

వాడు ఇంట్లో దూరి వెక్కివెక్కి ఏడుస్తున్నాడు...

అప్పుడే శవాన్ని ఎత్తుకున్నారేమో... వాడి ఏడ్పు డప్పుల చప్పుడుతో కల్సిపోయింది.

ఆ శవం తరలిపోయింది !!!

18/2/2002

* * *